

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

సోమవారం, 9 జూన్ 2025

8 పేజీలు

## డ్రగ్స్ రహిత దేశం కోసమే

# నషా ముక్త్ భారత్ అభియాన్

- మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దుదాం
- క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందించిన కలెక్టర్,ఎస్పీ







**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని, ఈఉద్యమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. నషాముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా రెండురోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఆశ్రమ్ ఆసుపత్రిలోని క్రీడామైదానంలో బహుమతులను జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్‌కిబానిసలూ కాకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చున్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగేదుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని 1972,14446 టోల్‌ఫ్రీ నంబర్లకు తెలియ జేయవచ్చన్నారు. విద్యతో పాటు క్రీడల పట్ల కూడా యువత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల కారణంగా శారీరక,మానసిక వికాసం కలుగుతుందని, అంతేకాక డ్రగ్స్ వంటి దుర్వ్యసనాలకు లోను కాకుండా ఉండేందుకు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె.ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమస్యపరిష్కారానికి ప్రతీ ఒక్కరిలో చైతన్యం రావాలన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేయడానికి,వాటి వినియోగంనివారించడానికి 'ఈగిల్' టీంలు, పోలీసుశాఖ సంయుక్తంగా పలు కార్యక్రమాలు తనిఖీలు

- తరువాయి 2లో..



## నేడు ఏలూరులో

## 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం

- పాల్గొననున్న జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి, నగదు పురస్కారం అందించేందుకు నిర్వహించనున్న షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులుచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. ఆదివారం సాయంత్రం స్థానిక

- తరువాయి 2లో..

## నేడు కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** అనివార్య కారణాలవల్ల ఈనెల తొమ్మిదో తేదీ సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కారవ్యవస్థ(పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూఅధికారి వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు అల్లూరి స్మృతి వనం వద్ద

# యోగా ర్యాలీలు



**భీమవరం,మేజర్‌న్యూస్:** యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతా రామరాజు స్మృతి వనం వద్ద ఈ నెల 9వ తేదీ సోమవారం నిర్వహించే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. యోగపై విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రదేశాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగిందని, ఇప్పటికే వశిష్ట గోదావరి వలందల రేవు వద్ద, ఆచంట వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో యోగా కార్యక్రమాలను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. రేపు భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే నాలుగవ కార్యక్రమాన్ని జూన్ 16న పేరుపాలెంబీచ్‌లో నిర్వహించుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జూన్21న జరిగే యోగాంధ్ర కార్యక్రమం మరియు అంతర్జాతీయ

- తరువాయి 2లో..

# రైతులకు కూటమి ప్రభుత్వంలోనే మేలు





## 80 మందికి ట్రాక్టర్లు అందజేసిన మంత్రి 'నిమ్మల', కలెక్టర్ నాగరాణి

**పాలకొల్లు ,మేజర్‌న్యూస్:** రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పాలకొల్లు నియోజకవర్గంలో 50 శాతం సబ్సిడీపై 80 మంది రైతులకుక్రిషి ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను జిల్లా కలెక్టర్ నాగరాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌లతో కలిసి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రిరామానాయుడు మాట్లాడుతూ జగన్ఐదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోలేదని, వ్యవసాయ శాఖను మూసివేసాడన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే రైతాంగానికి అవసరమైన పనులకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. రైతులకు ఆక్సిజన్ లాంటి క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియమును సైతం జగన్ ఎగ్గొట్టాడన్నారు. నాడు జగన్ పాలనలో ఒక బరకం ముక్క గానీ, యాంత్రపరికరం గానీ రైతులకు ఇవ్వలేదని,నేడు కూటమి ప్రభుత్వం కృషిట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, వరికోత యంత్రాలు సబ్సిడీతో అందిస్తుందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో

- తరువాయి 2లో..

# అండలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం





**వీరవాసరం/ భీమవరం,మేజర్‌న్యూస్:** వీరవాసరం మండలం అండలూరు గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బొండాడ గ్రామానికి చెందిన భార్య భర్తలు ద్విచక్ర వాహనంపై అండలూరు చర్చి వద్ద మలుపు తిరుగుతుండగా ఓలారీ ఢీకొనడంతో చిట్టజల్లి సత్యవతి (30) అక్కడి కక్కడే ప్రాణాలు విడిచింది.ఆమె భర్తకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరు వాడపల్లి దర్శనానికి వెళ్లి వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల కు ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తము అంబులెన్స్‌లో తీసుకువెళ్లారు. కాగా అండలూరు చర్చి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఉన్న రోడ్డు నిత్యం ప్రయాణికులతో రద్దీగా మారడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు విషయంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీలో 90 శాతం ఉత్తీర్ణత

**-అత్యధిక మార్కులు సాధించిన గంటా దెల్మా**

**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో నాలుగవ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వి.కేశవరావు తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని 440కి 434 మార్కులు సాధించి నియోజకవర్గంలో ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని గంట దెల్మాను ప్రిన్సిపల్ కేశవరావు మరియు ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## మహిళలపై అవమానిస్తూ వ్యాఖ్యలు చేసినవారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**చింతూరు,మేజర్‌న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని ఆదివారం మహిళలను దారుణంగా అవమానిస్తూ సాక్షి మీడియాలో కొమ్మినేని, కృష్ణంరాజులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చింతూరు పోలీస్ స్టేషన్ తెలుగు మహిళలు ఫిర్యాదు చేయడం జరిగింది. కొమ్మినేని, కృష్ణంరాజులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలి అని, తక్షణమే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కారం సత్యవతి, కారం అచ్చమ్మ, షేక్ ఫాతిమా, సోడి రాములమ్మ, మర్లపాటి గోపమ్మ, తెలుగుదేశం నాయకులు గెద్దం సురేష్ కుమార్ చౌదరి, మల్లెల వెంకటేశ్వరావు, కట్ట శంకర్ తదితరులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.

## గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ఈ నెల 9వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే అడగ వచ్చునన్నారు. కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చునన్నారు. అర్జీదారుల వద్ద నుండి వినతులను స్వీకరించి వారి యొక్క సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక యందు నమోదు చేస్తూ వారి సమస్యలకు పరిష్కారం తెలుపబడునని, ప్రజా సౌకర్యార్థం ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మూడు రెవెన్యూ డివిజన్లు 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాలలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, కావున అర్జీదారులు ఆయా స్థాయిలలో తమ సమస్యలను నమోదు చేసుకొని పరిష్కారం పొంది దిశగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**టి.నరసాపురం,మేజర్‌న్యూస్:** టి.నర్సాపురంలోని హైస్కూల్ సమీపం గల చర్చిలో కలపాల భూలక్ష్మి (45) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## సెర్ప్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యోగా డే



**ఏలూరు,మేజర్‌న్యూస్:** సెర్ప్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్ మహిళలచే జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లో ఏలూరు,జంగారెడ్డిగూడెం, నూజివీడు నందు యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు జిల్లా ఆయుష్ డిపార్ట్మెంట్ వారు ఆధ్వర్యంలో సెర్ప్ సంస్థ ద్వారా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు సెర్ప్ సిబ్బంది అయినా పిఎంలు డిపిఎంలు ఏపీఎంలు సీసీలు వివోఏలు మరియు సీనియర్ సిటిజన్ మహిళా సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమమునకు సుమారుగా 450 మంది నిర్వహించడం జరిగినది.

# నేడు కలెక్టరేట్ ఎదుట ఆయిల్ పామ్ రైతుల ధర్నా

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ, కేంద్ర ప్రభుత్వం పామాయిల్ పై 10శాతం దిగుమతి సుంకం తగ్గించడంపై ఈనెల 9న సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ ముందు ఆయిల్ పామ్ రైతుల ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్ కు ఆయిల్ పామ్ రైతుల సామూహిక రాయబార కార్యక్రమం విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు.ఆదివారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ముడి పామాయిల్ దిగుమతి సుంకం 10 శాతం తగ్గించి వేయడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.22 వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు,జిల్లాసహాయకార్యదర్శి కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత దేశం కోసమే నషా ముక్త్ భారత్ అభియాన్

మొదటిపేజి తరువాయి

నిర్వహిస్తు న్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని,దీనిద్వారా జీవితంలో ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోగలిగిన ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలలో మొదటి స్థానం పొందిన పోలీసు టీం,రెండవ స్థానం పొందిన జ్యూడిషియల్ టీం,మూడవస్థానం పొందిన రెవిన్యూటీం క్రీడాకారులకు బహుమతులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌లు అందజేశారు. జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డిఎస్ డిఓ బి.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడి వి.రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏలూరులో 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం

మొదటిపేజి తరువాయి

కలెక్టర్ బంగ్లా నుంచి విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు, జిల్లా ఇన్చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి,జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు,జడ్పీ చైర్మన్ ,శాసన మండలి సభ్యులు శాసనసభ్యులు, పాల్గొంటారన్నారు. ఈనెల 9వ తేదీ ఉదయం 9. 30 నిలకు ఏలూరులోని సర్ సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో నిర్వహించే కార్యక్రమ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని డిఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఆయా మండలాల నుంచి కార్యక్రమానికి వచ్చే పిల్లలను సురక్షితంగా సభా వేదిక కు తీసుకువచ్చి , తిరిగి వారి గమ్యస్థానాలకు చేరేవరకు సంబంధిత మండల టీంలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 83. 33 శాతం అంతకు మించి మార్కులు సాధించిన వారిలో మండలం నుండి 6గురు చొప్పున 163 మంది విద్యార్ధిని విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని, అదేవిధంగా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్, 20 వేల రూపాయల నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఏపి సి పంకజ్ కుమార్, విద్యా శాఖ ఏడి ఎం.వెంకటప్పయ్య,మండల విద్యాశాఖ అధికారులు ప్రభృతులు పాల్గొన్నారు.

## నేడు అల్లూరి స్మృతి వనం వద్ద యోగా ర్యాలీలు

మొదటిపేజి తరువాయి

యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సోమవారం తొమ్మిదో తేదీన అన్ని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలలో ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాపై ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయ స్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఆ సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు యోగా గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాని ప్రాక్టీస్ చేయాలని వారికి తెలియజేయడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మాస్ ర్యాలీని','జిల్లా స్థాయి యోగా పోటీలను విజయవంతం చేయాలన్నారు.

## రైతులకు కూటమి ప్రభుత్వంలోనే మేలు

మొదటిపేజి తరువాయి

ఇన్పుట్ సబ్సిడీ హెక్టార్కు 20 వేలు ఇస్తే జగన్ ప్రభుత్వం 16,వేలు కు తగ్గించిందని, నేడు హెక్టార్కు 25వేలు పెంచి అందించనుం దన్నారు. వైసిపి పాలనలో డ్రెయిన్లు లో గాని, కాలువల్లో గాని ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదని తెలిపారు.లాకులకు, షట్టర్ మరమ్మత్తులు మాట అటుంచి గ్రీజ్ వంటి మెయింటెనెన్స్ కూడా చేయలేదన్నారు.లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు, పాలకొల్లు ఏడి పార్వతి, పాలకొల్లు, పోడూరు ఏవోలు రాజశేఖర్, సత్యనారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అమరావతి మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు నిరసన





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** సాక్షి ఛానల్ కార్యక్రమంలో అమరావతి రాజధాని, మహిళలపై కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా పట్టణ పోలీస్ స్టేషన్ వద్దతెలుగుదేశంపార్టీ మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మహిళలకు జగన్మోహన్ రెడ్డి,ఆయన సతీమణి భారతి రెడ్డిలు బే షరతుగా క్షమాపణ చెప్పాలనిడిమాండ్ చేస్తూ పాలకొల్లు పట్టణ ఎస్సై జి పృధ్వికు ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలంతా ఆవేశంగా నినాదాలు చేశారు. జగన్, అతని సతీమణి భారతి రెడ్డిలు క్షమాపణ చెప్పాలని, అసభ్యకరంగా మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు,కొమ్మినేని శ్రీనివాస్‌రావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనియెడలమా పోరాటం ఆగదంటూ స్పష్టం చేశారు. సాక్షి ఛానల్, సాక్షి పత్రికను ప్రతి ఒక్కరూ బహిష్కరిం చాలని కోరారు. అమరావతి రాజధానిపై జగన్ ముఠా విషయం కక్కుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పెండ్యాల భవాని,ఎస్తేరు రాణి,బేతు నాగలక్ష్మి, దేవగానుగుల వరలక్ష్మి సంఘాల విజయలక్ష్మి తాళం అన్నపూర్ణ తాళ్లూరు విజయలక్ష్మి ఎర్రం శెట్టి దుర్గాభవాని గుబ్బల రామలక్ష్మి మల్లుల అమృతవల్లి పాల నాగలక్ష్మి దొమ్మేటి పార్వతి దబ్బ ఎస్తేరు రాణి పులి మాధురి పాల్గొన్నారు.

## అమరావతి మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిని శిక్షించాలి



**లింగపాలెం,మేజర్ న్యూస్ :** లింగపాలెం మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు చలపతి రావు ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం సమర్పిస్తూ, అమరావతి రాజధాని మహిళలపై అసభ్య పదజాలంతో మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సాక్షి న్యూస్ ఛానల్‌లో అమరావతి మహిళలపై అసభ్యకరమైన పదజాలంతోమాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేసిన లింగపాలెం మండల కూటమి నాయకులు, మహిళలు.

## వైఎస్‌పాలెంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం



**నరసాపురంరూరల్,మేజర్‌న్యూస్:** మండలంలోని వైయస్ పాలెంలో వేంచేసి ఉన్న న్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి 15వ వార్షికోత్సవంఆదివారం ఘనంగా నిర్వహించారు.స్వామివారి కళ్యాణం య ర్రం శెట్టి శ్రీనివాసరావు, య ర్రం శెట్టి భార్గవ దంపతులు చేస్వామివారికి కళ్యాణం చేశారు.

అనంతరం స్వామివారికి వార్షికోత్సవ కళ్యాణం,చక్రస్థానం నిర్వహించి, ఆలయపూజారిసూర్య కిరణ్‌చే స్వామివారి కళ్యాణం నిర్వహించడం జరిగినది. పరిసర ప్రాంత గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు.

## ఆర్టీసీ అప్పల నాయుడు చొరవతో జంగారెడ్డిగూడెం రోడ్డులో రిక్వెస్ట్ స్టాప్





**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** రోడ్డులో ఏపీఎస్ ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసింది.. బస్సు ప్రయాణికులు మెయిన్ రోడ్డు నుండి లునానీ నగర్, నేతాజీ నగర్, బీడీ కాలనీ వాసులు కాలనీలోకి రావడానికి వీలుగా స్టాప్ కావాలని ఎప్పటి నుండో కోరుతున్నారు. ఈ మేరకు విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడుకి 2వారాల క్రితం వినతి పత్రాన్ని అందజేశారు. రెడ్డి అప్పల నాయుడు చొరవతో ఆదివారం లునాని నగర్‌లో రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేశారు. దీనితో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు

**– కృష్ణంరాజు,కొమ్మినేనిపై ఫిర్యాదు చేసిన మహిళలు**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** అమరావతి మహిళ రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఫిర్యాదు చేశారు, పాత్రికేయుడు కృష్ణంరాజు సాక్షి న్యూస్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు రాష్ట్ర రాజధాని అమరావతి అక్కడి మహిళలను ఉద్దేశిస్తూ అసభ్య పదజాలంతో దూషించడం వాటిని ఆపకపోవడం సాక్షి ఛానల్‌లో ప్రసారం చేశారన్నారు.

ఆ వ్యాఖ్యలను ఖండించకుండా కృష్ణంరాజు సమర్థించారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు ఫిర్యాదు చేసిన వారిలో జంగారెడ్డిగూడెం మండల మహిళలు మండలంలోని గ్రామాల్లోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేడే పురపాలక సంఘం ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :**పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం వారి ఆదేశానుసారం ఉదయం ఏడు గంటలకు పురపాలక సంఘం కార్యాలయం నుండి పోలీసు ఐలాండ్ వరకు నిర్వహించబడుతుందని కమిషనర్ ఏసుబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు మెప్మా సిబ్బంది రిసోర్స్ పర్సన్ స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు సిబ్బంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

## బండి ముత్యాలమ్మ జాతర సందర్భంగా వాహనాలు దారి మళ్లింపు

**మొగల్తూరు, మేజర్ న్యూస్:** మండలంలోని ముత్యాలపల్లి లో జరుగుతున్న శ్రీ బండి ముత్యాలమ్మ జాతర సందర్భంగా 216 జాతీయ రహదారిపై వెళ్ళు వాహనాలను దారి మళ్లించినట్లు మొగల్తూరు పోలీసులు తెలిపారు. 9వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుండి పదవ తేదీ ఉదయం 10 గంటల వరకు ఈ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. దిగమర్రు నుండి మచిలీపట్నం వైపువెళ్లు వాహనాలు దిగమర్రు నుండి పాలకొల్లు, భీమవరం,లోసరి మీదుగా మచిలీపట్నం వెళ్ళవలెను. మచిలీపట్నం నుండి నరసాపురం వైపు వెళ్ళు వాహనాలు ముత్యాలపల్లి సెంటర్ మీదుగా వార తిప్ప, వెంప,కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి మీదుగా నరసాపురం మళ్ళించారు. పాలకొల్లు నుండి నరసాపురం మీదుగా మచిలీపట్నం వెళు ్ళ వాహనాలు పాలకొల్లు నుండి భీమవరం మీదుగా లోసరి నుండి మచిలీపట్నం వెళ్ళవలె నని పోలీసులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని వారు కోరారు.

## ఏపీ ఎంసెట్ ఫలితాలలో దేదీప్యకు 358వ ర్యాంక్



**నూజివీడు, మేజర్ న్యూస్:** ఆదివారం విడుదల అయిన ఏపీ ఎంసెట్ ఫలితాలలో నూజివీడు శ్రీ శారదా కళాశాల విద్యార్థిని కె దేదీప్య సాయి 358వ ర్యాంకు సాధించి నూజివీడు చరిత్రలోనే మొదటిసారి అత్యుత్తమ ర్యాంకు సాధించిన కళాశాల విద్యార్థినిగా నిలిచిందని నూజివీడు శ్రీ శారదా విద్యా సంస్థల చైర్మన్ కుప్పాల శంకర్రావు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పలు పరీక్ష ఫలితాలలో శ్రీ శారద విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించటం తో పాటుగా రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు.ఈ సందర్భంగా ఎంసెట్లో 358వ ర్యాంకు సాధించిన కె. దేదీప్య సాయిని కళాశాల చైర్మన్ శంకర్రావు తో పాటు అధ్యాపక బృందం, పుర ప్రముఖులు దేదీప్య సాయిని అభినందించారు.

## సాక్షి జర్నలిస్టులను అరెస్టు చేయాలి : 'దేశం' మహిళా విభాగం ఫిర్యాదు



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల ఏడవ తేదీన సాక్షి ఛానల్ లో మహిళలను అవమానించే విధంగా ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమరావతి రైతులు వేస్యలని,అమరావతి వేశ్యల రాజధాని అని ప్రచారం చేయడాన్ని వారు ఖండించారు. ఈ కథనానికి రూపకర్తలుగా ఉన్న కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, వెంటనే అరెస్టు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమణి శశిదేవి, కొలచన శ్రీ పద్మ, శశి, బస్వాని నాగమణి, విజయలక్ష్మి తదితరులు పట్టణ ఎస్సై జయలక్ష్మికి వినతి పత్రం అందించారు.

# ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**– జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అనేది ఒక వ్యక్తికి ఆరోగ్య సమస్య లేదా అత్యవసర పరిస్థితి కాని సమస్య ఎదురైనప్పుడు వారు ఆరోగ్య వ్యవస్థతో చేసే మొదటి పరిచయాన్ని వివరించడానికి ఉపయోగించే కమ్యూనిటీ పేరా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ను మన తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో స్థాపించడం మన ప్రాంతానికి గర్వకారణమని జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ అన్నారు. ఆదివారం స్థానిక యాగర్లపల్లి కమ్యూనిటీ పేరా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ పి.ఎం పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన కార్యాలయాన్ని జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.ఎం.పి ప్రాజెక్టును ప్రప్రథమంగా దేశవ్యాప్తంగా ప్రజలకు అవసరమైన అత్యవసర వైద్య సేవ సదుపాయాలను ఇక్కడ ప్రారంభించడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ప్రజలకు అవసరమైన అత్యవసర వైద్య సేవలను పిఎంపి ద్వారా అందుకోవచ్చునని చెప్పారు.నిస్వార్ధమైన సేవాభావంతో పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నీలపాల దినేష్, తోరాటి ప్రభాకర్ రావు,విబి టి రాజు,గంగు మల్ల రాంబాబు, కెజనార్ధన్, శంఖవరపు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## నడిపూడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**పెనుగొండ, మేజర్ న్యూస్:** తణుకు ప్రోహిబిషన్,ఎక్సైజ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిపిన దాడులలో పెనుగొండ మండలంలో నడిపూడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పుల్ల శ్రీను(49) అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 4 మద్యం సీసాలను స్వాదీనం చేసుకోవడం జరిగింది.ఎవరైన బెల్ట్ షాపులు నిర్వహించినా లేదా అక్రమంగా మద్యం విక్రయాలు జరిపిన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తణుకు ప్రోహిబిషన్ ,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్ .మణికంఠ రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఆర్.మధు బాబు,కానిస్టేబుల్ కె.నాగరాజు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీ నృసింహుని రథోత్సవం



**యలమంచిలి,మేజర్ న్యూస్:** మండలంలోని కొంతేరు శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సన్నాయి, మేళ తాళాలు, బ్యాండ్ వాయిద్యాలతో బాణాసంచా లతో అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మల్లుల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డాల సత్యనారాయణ, మంచెం పుల్లారావు, అందే వీర రాఘవులు, వర్ధినీడి మణికంఠ,అడ్డాల రామకృష్ణ,తోలేటి భీమేశ్వరరావు,మంచెం సుబ్బారావు, మంచెం సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వేశ్యల రాజధాని అని సంబోధించటం దారుణం



**కైకలూరు,మేజర్ న్యూస్ :** సాక్షి ఛానల్లో కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహిస్తున్న ఒక డిబేట్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై వేశ్యల రాజధానిని సంబోధించిన జర్నలిస్ట్ కృష్ణంరాజు పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన పాత్రికే సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి వైయస్ జగన్మోహన్ రెడ్డికి చెందిన సాక్షి పత్రిక సాక్షి న్యూస్ ఛానల్ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై విషం కక్కుతూ జగన్మోహన్ రెడ్డి తన మనసులోని మాటను సాక్షి పత్రిక సాక్షి న్యూస్ ఛానల్ ద్వారా తన అక్కస్సును వెళ్ళకకుచున్నారని తెలిపారు. జర్నలిస్ట్ కృష్ణంరాజు మీద ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఈ చర్యల ద్వారా భవిష్యత్తులో మరొకరు రాజధాని అమరావతిపై చెడుగా మాట్లాడాలంటే కరెంట్ షాక్ కొట్టే విధంగా చర్యలు ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తిరుమాని గోపాలకృష్ణ. కొక్కిలిగడ్డ ఈశ్వర పరశురాముడు. కోకా తాతయ్య.దున్నా సత్యనారాయణ .తదితరులు పాల్గొన్నారు.

# కొప్పాకలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**పెదవేగి,మేజర్ న్యూస్ :** మనిషి ఎప్పటికీ మారని జీవ కులము లో ఎన్న టికీ మారని దైవమతము లో ఉన్నాడు అనే సత్యం గ్రహించాలి అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షులు, సభ్యుల అరుణ్ కుమార్ అన్నారు.ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెదవేగి మండలం లోని కొప్పాక గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం మానవుడు ఎప్పటికీ మారని జీవ కులము లో ఉన్నావు ఎప్పటికీ మారని దైవమతం లో ఉన్నావు. అంటే మనిషి తెలియకుండానే ఎప్పటికీ మారని కులము లో ఎప్పటికీ మారని మతము లో ఉన్నాడని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం ను తెలియజేస్తుంది అని ప్రతి మనిషి అహం తో జీవిస్తూ తాను జీవాత్మ నని గ్రహించ లేకున్నాడు అని, అనేక మతాలను సృష్టించుకుని తనది శాశ్వతమైన దైవమతము అని దైవ మార్గమని గ్రహించ లేకున్నాడు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యులు కోటేశ్వరరావు,అశోక్, శ్రీకాంత్,రామాంజనేయులు, సుందర్ రావు, మోహన్ కుమార్ ,శివనాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# స్కీం వర్కర్లలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**వేలేరుపాడు, మేజర్ న్యూస్ :** కన్నాయిగుట్ట గ్రామంలో స్కీమ్ వర్కర్ల సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కీమ్ వర్కర్ల రాష్ట్ర నాయకురాలు జె.లలిత, సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, బుచ్చిబాబు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఏఐటీయూసీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజమ్మ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం ధారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే మహిళలు, స్కూల్ స్వీపర్సు సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనం 32000 ఇవ్వాలన్నారు.స్కీం లో పనిచేసే మహిళా కార్మికులకు, కనీస వేతనాలు ఈఎస్ఐ పిఎఫ్ గ్రాడ్యుడిటీ ఇన్సూరెన్స్, గౌరవ వేతనాల బిల్లులు,సెంటర్ల నిర్వహణ నిర్వహించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమస్యలపై జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలి యజేసారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ..

**– 1100 మీకోసం కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు నమోదు**



**భీమవరం,మేజర్ న్యూస్ :** 2025. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జూన్ 9 సోమవారం జిల్లా స్థాయితో పాటు డివిజనల్, మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక"అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ మరియు మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు,డివిజనల్ కార్యాలయాలు,

మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చు నన్నారు. అదే విధంగా అర్జీదారులు యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీ కోసం ap.gov.in వెబ్సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవచ్చును. అర్జీల నమోదు,నమోదైన అర్జీల గురించి వాటి స్థితికి సంబంధించి ఇన్ఫర్మేషన్ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కూడా తెలియజేసారు.

## నేడు ఏలూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**ఏలూరు,మేజర్న్యూస్ :** స్థానిక 33 కేవి ఏలూరు సబ్ స్టేషన్ లో మరమ్మతులు చేయుటకు ఈ నెల 9వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.యం.అంబేద్కర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

కనుక పవర్ పేట, పాత బస్టాండ్ ,గూడ్స్ షెడ్ రోడ్డు, వసంత మహల్ సెంటర్, వైఎంహెచ్ హాల్, మెయిన్ బజార్, చందన బ్రదర్స్ రోడ్,తూర్పు వీధి,పడమర వీధి, దక్షిణపు వీధి,పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని అన్నారు. వినియోగదారులు సహకరించాలని అంబేద్కర్ కోరారు.

# అమరావతిపై విషప్రచారమా ?

**– టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి**



**భీమవరం,మేజర్‌న్యూస్:**దేవతలరాజధాని అమరావతి మహిళలను, ప్రజలను కించపరుస్తూ అమరావతి వేశ్యల రాజధానిగా వ్యాఖ్యానించిన వారిని కఠినంగా శిక్షించాలని భీమవరం 1 టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నకు టిడిపి మహిళలు నాయకులు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు నియోజకవర్గ ఇన్చార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ అమరావతి రాజధాని మహిళలు ప్రజలను కించపరుస్తూ అసభ్యకరంగా అమరావతి వేశ్యల రాజధానిగా సాక్షి టీవీలో మాట్లాడిన వైసీపీ జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడించిన కొమ్మినేని శ్రీనివాస్ సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటూ వెంటనే అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని అన్నారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు ఏపీఐఐసి చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ సాక్షి టీవీలో అమరావతి ప్రాంతాన్ని, అక్కడి మహిళలను ప్రజలను అవమానపరిచేలా జగన్ మాట్లాడించడం దుర్మార్గమని సాక్షి డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కార హీనులు ,కిరాయి బ్యాచ్ మహిళలను కించపరని అన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ 2014లో అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఒప్పుకొని, 2019లో అక్కడే గృహాన్ని నిర్మించుకుంటున్నానని, రాజధాని మార్చే అవకాశం లేదని రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి ఎన్నికలకు వెళ్లి,ఆతరువాత ప్రజలను మోసం చేసి మూడు రాజధానులు అంటూ ఐదేళ్ల కాలాన్ని వృధా చేసిన జగన్మోహన్ రెడ్డి ఇంకా ఆపంథా వీడలేదన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ఇంటితో పాటు రాష్ట్రంలో ప్రముఖ నాయకుల గృహాలన్నీ అమరావతి ప్రాంతంలోనే ఉన్నాయని గుర్తుపెట్టుకోవాలన్నారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దుల రాము మాట్లాడుతూ చరిత్ర తెలియని అజ్ఞానంతో అమరావతి ప్రాంతంపై ఇష్టా రీతిన దుష్ప్రచారం చేయిస్తున్నారని,వైజాగ్ లో భూములు కొట్టేసినట్లుగా అమరావతిలో ఒక్క సెంటు కూడా భూమి కొట్టేయడానికి వీలుపడక పోవడంతో అమరావతిపై కక్షకట్టి జగన్‌ఈవిధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ,పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దుల రాము ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్ భీమవరం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోళ్ల సీతారాం,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలను కించపరుస్తూ మాట్లాడిన జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి




**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్** : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి భవన ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు చైర్మన్ వలవల బాబ్జి సూచనల మేరకు సాక్షి టీవీ డిబేట్‌లో కృషంరాజు వేశ్యల రాజధాని అమరావతి అంటూ వ్యాఖ్యానించినందుకు నిరసనగా తాడేపల్లిగూడెం సాక్షి పేపర్ ఆఫీస్ ఎదుట జిల్లా తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా అధ్యక్షురాలు రాష్ట్ర మహిళా కమీషన్ మాజీ సభ్యురాలు డా. శిరిగినీడి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాజధాని మహిళలను కించ పరుస్తూ వేశ్యల రాజధాని అంటూ మాట్లాడం దారుణమని మహిళల పట్ల వైసీపీ కి ఉన్న అభిప్రాయం ఏమిటో ప్రజలకు అర్థమైనదని వీరి పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. రాష్ట్ర తెలుగుమహిళా ఉపాధ్యక్షురాలు దాసరి కృష్ణవేణి మాట్లాడుతూ రాజధాని అమరావతి పై అసభ్యంగా మాట్లాడిన కృష్ణం రాజు కొమ్మినేని శ్రీనివాసరావుపై కేసు నమోదు చేయాలని జగన్‌సాక్షియాజమాన్యం క్షమాపణ చెప్పాలని కోరారు. అనంతరం సాక్షి దిన పత్రికలను తగుల బెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తమరాపు రమణమ్మ జిల్లా కార్యదర్శి రేవతి, చిన్నాయమ్మ, స్వర్ణలత వరలక్ష్మి తెలుగుదేశం మహిళా నాయకురాళ్లు కొల్లి రామావతి శ్రీరాముల విజయలక్ష్మి లింగంపల్లి స్వాతి, మొండెం లీల, నియోజకవర్గం తెలుగుమహిళలు పాల్గొన్నారు.

# ప్రయోగశాలల ఫలితాలు రైతులకు అందించేందుకు వికసిత కృషి అభియాన్




**భీమడోలు,మేజర్ న్యూస్** : ప్రయోగశాలల ఫలితాలు నేరుగా రైతుల కు అందించేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత కృషి అభియాన్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్త డాక్టర్ వి.విజయలక్ష్మి, ఏరువాక కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ బి భూచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం భీమడోలు లోని రైతు సేవా కేంద్రం ఒకటి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ అధికారి ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ఎరువుల వాడకాన్ని క్రమబద్ధీకరించే క్రమంలో ప్రభుత్వాలు గతం కన్నా భిన్నంగా భూసార పరీక్షలు ఆధారంగా ఎరువుల విడుదలకు సిఫార్సు చేయమన్నాయన్నారు. తాజాగా తీసుకొన్న వాటికి సైతం సదరు సిఫార్సులు వర్తిస్తాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఎక్కువ ఆదాయం పొందినందుకు స్వర్ణ రకం వరి స్థానంలో మార్టేరు పరిశోధన సంస్థ తాజాగా విడుదల చేసిన ఐదు రకాల ఇతర వరి రకాలు వాడాలని సూచించారు. ఈ మేరకు రైతులకు అవసరమైన సహాయ సహకారాలను వ్యవసాయ శాఖతో పాటు, మార్టేరు వరి పరిశోధన సంస్థ అందజేస్తుందన్నారు. దీనితోపాటు నీటి ఎద్దడిని తట్టుకోవడంతోపాటు ,గింజ రాలే స్వభావం తక్కువగా ఉండే వరి విత్తనాలు మార్టేరు వరి పరిశోధన సంస్థ తయారుచేసి రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిందన్నారు. వ్యవసాయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ, పంట మార్పిడి విధానం వల్ల రైతులకు ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ ల ద్వారా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ చైర్మన్ ఎస్.ఎస్.గిరి,నీటి సంఘం అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, పంచాయతీ పాలకమండలి సభ్యులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ప్రతిభ అవార్డుకు ఎంపికైన శ్రీ చైతన్య విద్యార్థినులు




**చింతలపూడి,మేజర్‌న్యూస్** : స్థానిక చింతలపూడి శ్రీ చైతన్య విద్యార్థులు 2024-25 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ప్రతిభ అవార్డులలో చింతలపూడి శ్రీ చైతన్య విద్యా సంస్థకి నాలుగు అవార్డులు ప్రకటించారని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వరలక్ష్మి ప్రసన్న ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వరలక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ ప్రతిభ అవార్డులలో శ్రీ చైతన్య విద్యార్థులు నాలుగు ప్రతిభ అవార్డులు సాధించి తమ విద్యార్థులు ప్రతిభను మరోసారి చాటారని అన్నారు. విద్యార్థులు కష్టపడి,ఏకాగ్రతతో చదివితే ఉన్నత మైన స్థానం లభిస్తుంది అని ప్రసన్న అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ అవార్డులు సాధించిన విద్యార్థులు వి.హర్షితా రాణి,సి.హెచ్ .గాయత్రి, ఎం.సంధ్య,జె.వేదశ్రీలను ఏ.జీ.ఎం.పార్థసారథి ,ఆర్.ఐ.ఉదయ భాస్కర్,కో-ఆర్డినేటర్. వెంకటేశ్వర రావు,ఏ.వో. రవీంద్ర, డీన్.ఎన్.చెన్నకేశవ,సిబ్యాచ్‌ఇంచార్జ్ మధు,పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు .

# మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం

**– మండల టిడిపి అధ్యక్షులు వేణు**



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసి పోవడం ఖాయమని ఆగిరిపల్లి మండల టిడిపి అధ్యక్షులు నక్కనబోయిన వేణు అన్నారు. అమరావతి గురించి సాక్షి డిబేట్లో అమరావతి వేశ్యల రాజధానిగా మాట్లాడి,అమరావతి ప్రాంత పరిసర ప్రాంత ప్రజల మనోభావాలను కించపరుస్తూ,మరి ముఖ్యంగా స్త్రీల మనోభావాలను కించపరిచిన సాక్షి మీడియా ప్రతినిధులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాల్సిందిగా,ఆదివారం కూటమి నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నెరుసు సతీష్,నలజాల హరిబాబు,ఆరేపల్లి శ్రీనివాసరావు,దొండపాటీ ఏసుపాదం, చిట్నేని శివరామ కృష్ణ, కొవ్వలి బాబురావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మృగశిర మాసంలో కనిపించని ఏరువాక



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** రోహిణి కార్తీ పూర్తయి మృగశిర మాసంలోకి ప్రవేశించి నప్పటికి ముందస్తుగా వర్షాలు పడి తీవ్రమైన ఎండలు కాయడంతో కాలాలు మారుతున్నాయి అనిపిస్తుంది, ఈపాటికి వర్షాలు పడి రైతాంగం అంతా ఏరువాక పౌర్ణమి కార్యక్రమాలు చేసి చాలను దుక్కు దున్ని ఆకుమడులు వేసే కార్యక్రమం చేపట్టేవారు,అయితే చేలకు నీరు అందగా పంట కాలువలు నీరు వదలక దుక్కులు ప్రారంభానికి నోచుకో లేదు అందుకే గాలి వానలు తుఫానులు వచ్చే సమయాలలో పంటలు విరివిగా పండడం చేతికొచ్చిన పంట నోటికి రాకపోవడం జరుగుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, సన్న కారు,కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నామని వాపోతున్నారు.

# ఈగలు - దోమలతో ప్రజల సహవాసం

**- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ - పట్టించుకోని అధికారులు**



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** రాత్రి దోమలతో పగలు ఈగలతో సహవాసం చేయాల్సి వస్తుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో మలేరియా టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మారుమూల ప్రాంతంలో కాదు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది.సుమారు 10 సంవత్సరాల నుండి డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడని చెబుతున్నారు. దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలో చెత్తాచెదారం నిల్వ ఉండడంతో ఇళ్లల్లో వాడుకున్న నీరు పెళ్ళే మార్గం లేక ఎక్కడికక్కడే మురికి నీళ్లు నిలిచి పోతున్నాయి. వర్షాకాలంలో డ్రైనేజీలో ఉన్న మురికి నీరు ఇళ్లల్లోకి వస్తుందని వాపోతున్నారు. రాత్రి సమయంలో కాసేపు బయట ఉంటే దోమలు కాటేస్తున్నయని పగలు ఇళ్లల్లో ఉంటే ఈగలు ముసిరేస్తున్నాయని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.రాత్రి దోమలతో పగలు ఈగలతో సహవాసం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో మలేరియా టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వీధిలైట్లు సక్రమంగా వెలగటంలేదని చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఓట్లు కోసం వస్తున్నారా తప్ప తర్వాత కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని బహిరంగంగా విమర్శిస్తున్నారు. అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా దున్నపోతు మీద వర్షం కురిసినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని డ్రైనేజీలో చెత్తాచెదారం తీయించి కొత్త డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# ఈ నెల 10న కెఆర్ పురంలో జాబ్ మేళా

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** ఈ నెల 10వ తేదీన నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐ.టి.డి.ఏపి ఓకే.శ్రీరాములు నాయక్ తెలియజేసారు. ఐ.టి.డి.ఏ కార్యాలయము నేషనల్ కెరీర్ సర్వీసు,ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యములోఈ జాబ్ మేళానిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 10తేదినకోట రామచంద్రపురం ఐటిడిఏ. వద్ద మీటింగ్ హాల్లో జాబ్ మేళాకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.టీం మెంబెర్ ట్రైనీగాపనిచేయుటకు ఇంటర్మీడియట్, డిగ్రీ,డిప్లొమా,మొదటి ప్రయత్నం లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని 18 నుండి 22 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని అన్నారు. ఇంటర్వ్యూలో అర్హత సాదించిన అభ్యర్థులకు సంవత్సరానికి సుమారు 2.34 లక్షలు జీతం,పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉద్యోగములో సెలెక్ట్ అయిన వారికి ఉన్నత చదువులకు, స్కిల్ ట్రైనింగ్ కుడా అవకాశం ఇవ్వడం జరుగుతుందని సబ్సిడీ మీద ఇతర సదు పాయాలు కల్పించబడతయాన్నారు. ఎంపిక ప్రక్రియలో అభ్యర్థులు ఆప్టిట్యూడ్ టెస్ట్, సుడోకు వ్యక్తిగత ఇంటర్వ్యూలో పాల్గొనవలసి ఉంటుందన్నారు జీతము రూ.15000 నుండి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్ కోడ్లో రిజ్యూమ్ సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ముందుగా bit.ly/ncsregister లింక్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం 8886882032 నంబరును సంప్రదించవచ్చు.

# నేడు కలక్టరేట్ వద్ద ఎపిడబ్ల్యూజెఎఫ్ జర్నలిస్టుల నిరసన

**- కేంద్రం రద్దుచేసిన కార్మిక చట్టాలు పునరుద్దరించాలి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** కేంద్రం రద్దు చేసిన కార్మిక చట్టాలలో రెండు జర్నలిస్టులకు సంబంధించిన చట్టాలు ఉన్న సంగతి తెలిసిందే.వాటిని యధా తధంగా కొనసాగించాలని ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏ పి డబ్ల్యు జెఎఫ్) డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోరాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 9వ తేదీ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టినట్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ డి జబీర్, కార్యదర్శి హరీష్ తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాలలో నల్ల రిబ్బన్లు ధరించి కలక్టరేట్ వద్ద నిరసన తెలిపాలని నిర్ణయించింది. కాబట్టి మన జిల్లా కేంద్ర ఏలూరు కలక్టరెట్ వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు జరుప తలపెట్టిన నిరసన కు జిల్లా లోని ఫెడరేషన్ బాధ్యులు,సభ్యులు హాజరు కావాలని జిల్లా అధ్యక్షులు జబీర్ కార్యదర్శి హరీష్ కోరారు. ఈకార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు ఇతర బాధ్యులు జిల్లా నాయకులు తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# యోగాను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రధాని,సిఎం విశేష కృషి






**- ఎమ్మెల్యే బడేటి చంటి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆరోగ్యహితమైన యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. స్థానిక శ్రీరామ్ నగర్‌లోని శ్రీశ్రీ విద్యాసంస్థల ప్రాంగణంలోఆదివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ మెడిటేషన్ సెంటర్, టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ ట్రైనర్లు అక్కడకు విచ్చేసిన వారితో యోగాసనాలు వేయించారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ యోగా విశిష్టతను వివరించారు. యోగాను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రధాని మోదీ విశేష కృషిచేస్తే దాన్ని రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరువచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు.

ఇటు ఏలూరులో కూడా యోగాంధ్ర కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, శారీరక ఆరోగ్యాన్నీ, మానసిక ప్రశాంతతను చేకూర్చే యోగాను అందరూ అభ్యసించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిఆర్వో వి. విశ్వేశ్వరరావు, శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ, బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ నిర్వాహకులు,రాజయోగిని బికే లావణ్య, టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ స్థాపకులు కమ్మ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎస్ రామచంద్ర రెడ్డి ,జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు సూచనలు, ఆదేశాల మేరకు 2025 26 సంవత్సరంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలో విద్యాలయులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెరువుగట్లు, కాలువగట్లు, రోడ్డు పక్కన విరివిగా మొక్కలు నాటడానికి మానవత సంస్థ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల వారికి నేరేడు,మామిడి, కొబ్బరి, పనస ,సీమ చింత ,చింత,విప్ప, తాటి తదితర మొక్కలను నాటడానికి ఉచితంగా అందజేయను న్నామని జంగారెడ్డి గూడెం మానవత అధ్యక్షులు అయినాల రమణమూర్తి 9440 389633,దల్లి రామాంజనేయ రెడ్డి సభ్యులు పర్యావరణ కమిటీ 95533 88100 జంగారెడ్డిగూడెం అటవీ శాఖ అధికారులు సంప్రదించాలని తెలిపారు.

# కుటుంబ కలహాలు నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య

**మండవల్లి,మేజర్‌న్యూస్:** మండవల్లి మండలం గున్ననపూడి శివారు లేళ్లపూడిలో కుటుంబ కలహాలు నేపథ్యంలో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్యాభర్తల మధ్య గొడవతో మనస్తాపం చెందిన రాజేశ్వరి అనే యువతి మృతి చెందింది. ఆమె భర్త సతీశ్ పనికి వెళ్లిన తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కోకో గింజల దొంగలు అరెస్టు



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** టి.నర్సాపురం మండలంలో కోకో గింజలు అపహరిస్తున్న నలుగురు వ్యక్తులు జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. వారి వద్ద నుండి 2వేల కేజీల కోకో గింజలు,ఆటో స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు,కోకో గింజలు,ఆటో విలువ సుమారు 8 లక్షలుగా వెల్లడించారు. పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తుల కోసం గాలింపుచర్యలుప్రారంభించినట్టు తెలిపారు.దీంతో కోకో గింజల దొంగలను త్వరగా పట్టుకున్నందుకు జంగారెడ్డి గూడెం పోలీసులను రైతులు అభినందిస్తున్నారు.

# ఆర్టీసి బస్ స్టేషన్‌లో ఫ్యాన్లు ఏర్పాటు



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అధునతన,తక్కువ విద్యుత్ వినియోగించి బిఎల్‌డిసి ఫ్యాన్ల ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ వారు సామాజిక బాధ్యతతో భాగంగా మొదటి విడతగా పంపిణీ చేసిన ఫ్యాన్లను జంగారెడ్డిగూడెం డిపో పరిధిలోని స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బిగించడం జరిగిందని డిపో మేనేజర్ గంగాధర్ మీడియాకు తెలిపారు. వీటివల్ల ప్రయాణికుల సౌకర్యంతో పాటు విద్యుత్ వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణలోపాలు పంచుకోవటం జరుగుతుందని జిఎం తెలిపారు.

# సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

## - సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి హేమ శంకర్



**ఏలూరు,మేజర్‌న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఏలూరు ఏరియా 2వ డివిజన్ మహాసభ ఏరియా కార్యవర్గ సభ్యురాలు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభలో పాల్గొన్న సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ భావాలు కలిగిన వారంతా స్వాతంత్ర్య పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం రాజాభరణాల రద్దు,బ్యాంకుల జాతీయకరణ, దున్నేవాడికే భూమి,సమాన పనికి సమాన వేతనం వంటి పోరాటాలతో పేద ప్రజలకు దేశ స్వాతంత్ర్య ఫలాలను అందించేందుకు అనేక పోరాటాలను భారత కమ్యూనిస్టు పార్టీ చేసిందని తెలిపారు. ఏరియా కార్యవర్గ సభ్యురాలు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్ సిక్స్ పథకాల అమల్లో విఫలం అయిందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రేపు మాపు అంటూ ఆగస్టు 15కు ముహూర్తం పెట్టారని దాన్ని కూడా అమలు చేస్తారో లేదోనని ఎద్దేవా చేశారు. అనంతరం రెండో డివిజన్ సమితిని ఐదుగురు సభ్యులతో ఎన్నుకున్నారు. లక్కోజు జగదీశ్వరి కార్యదర్శిగా,ఆనం లక్ష్మీ సహాయ కార్యదర్శిగా కనితి అంజలి, జాన రాజేశ్వరి ఆడాది దుర్గ సభ్యులుగా ఎన్నిక కాబడ్డారు. ఈ మహాసభలో ఆదురుపతి లక్ష్మీ,కొల్లి సూర్యవతి,లక్కోజు గోపి,కొల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే బాలరాజు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** వేలేరుపాడు పోలవరం ఆర్అండ్ఆర్ చల్లవారిగూడెం నిర్వాసిత కాలనీలో ఏర్పాటు చేసిన టి 10 క్రికెట్ ఫైనల్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు బర్రింకలపాడులోని ఆయన క్యాంపు కార్యలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బహుమతులు అందజేశారు. క్రీడలు అలవర్చుకున్న యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఉంటారని ఎమ్మెల్యే అన్నారు. మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని,ప్రతి ఒక్కరు క్రీడల ద్వారా ఆరోగ్య వంతమైన జీవితాన్ని గడపొచ్చని ఎమ్మెల్యే అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నిర్వాసితులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# కక్ష ధోరణి తోనే గోడ కూల్చివేత

## - మాజీ సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఫోన్లో పరామర్శ



**దెందులూరు,మేజర్‌న్యూస్:** చల్లచింతలపూడిలో ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి మాజీ గ్రామ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ ఇంటి ప్రహరీ గోడను టిడిపి నుంచి వైఎస్ఆర్సిపి లో చేరినందుకే రాజకీయ కక్ష ధోరణితోనే కూల్చివేశారని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి గ్రామ మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణలను ఫోన్లో పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు ధైర్యంగా ఉండాలని వైఎస్ఆర్సిపి అండగా ఉంటుందనీ సూచించారు. ఇటువంటి సంఘటనలు ఎంత మాత్రం సరైనది కాదని గోడ కూల్చివేతపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. బాధితులకు అండగా ఉండి న్యాయపోరాటం చేస్తామన్నారు. కూల్చివేతలో విధులు నిర్వహించిన వారు కచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. నియోజకవర్గంలో భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరిగితే వైఎస్ఆర్సిపి చూస్తూ ఊరుకోబోదన్నారు.

# నేడు షైనింగ్ స్టార్స్ పేరిట విద్యా పురస్కారాలు

## - ప్రతిభ కనపరచిన 10,ఇంటర్ విద్యార్థులకు అవార్డులు,నగదు పురస్కారాలు



**భీమవరం,మేజర్‌న్యూస్:** టెన్త్,ఇంటర్ విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం స్థానిక ఏఎస్ ఆర్ సాంస్కృతిక కేంద్రం నందు ఉదయం జరుగనున్న షైనింగ్ స్టార్స్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లును జిల్లా కలెక్టర్ చదలవాడనాగరాణి తెలిపారు. 10వ తరగతి,ఇంటర్మీడియట్ విద్యార్థులను విద్యార్థులను మరింతగా ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని ఇందులో భాగంగా 2024 - 25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాలో కూడా ఉత్తమ ప్రతిభ పాటవాలు కనబరిచిన విద్యార్థులకు సోమవారం ఉదయం జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలు, తదితర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డును అందించి అభినందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల,ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన వారిలో మండలం నుండి 6 మంది ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 20 మండలాల నుండి 119 మంది పదో తరగతివిద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని, అదేవిధంగా జిల్లాలోనిప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థిని, విద్యార్థులను ఎందుకు చేయడం జరిగిందని, వీరందరికీ సర్టిఫికెట్, మెడల్, రూ.20 వేలు చెక్ రూపంలో అందజేసి అభినందించడం జరుగుతుందన్నారు. రేపు సోమవారం ఉదయం 9గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# 10న గ్రామీణ పేదల సమస్యల పరిష్కారం కోసం ధర్నా

**ఏలూరు,మేజర్‌న్యూస్:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీ మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసిల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్యదర్శులు మండల యూనిట్లకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల గురవయ్య బండి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. బికేయంయు జాతీయ సమితి పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్రచట్టంచేయాలని,ఎస్సీ ఎస్టి,మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సక్రంగా అమలు చేయాలని, ఉపాధి పనులు చేసిన కూలీలకు బకాయిపడిన వేతనాలు వడ్డీతో చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకానికి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేస్తున్నట్లు గురవయ్య, వెంకటేశ్వరరావు తెలిపారు.

# 'పండా' కుటుంబ సభ్యులను పరామర్శించిన వైసిపి నేతలు



**ఏలూరు,మేజర్‌న్యూస్:** చాణిక్యపురి కాలనీలో నివాసం ఉంటున్న పండా సత్య నారాయణ ఇటీవల స్వర్గస్తుల య్యారు. ఆదివారం వారి పెద్ద కార్యమునకు హాజరై చిత్ర పటానికి పుష్పాలతో నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్(జెపి) పరామర్శించారు. ఆయన వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నెరుసు చిరంజీవి,నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడీ దుర్గారావు, సీనియర్ నాయకులు కొల్లిపాక సురేష్ ,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 10 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి

## - సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య



**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్మిక చట్టాలలో మార్పులు తీసుకురావడం తీవ్ర అభ్యంతరకరం అని,తక్షణమే 10గంటల పని విధానాన్ని ఉపసంహరించు కోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానాన్ని రూపొందించుకోవడం కోసం కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. 8 గంటల పని విధాన చట్ట రక్షణకు చెల్లు చీటీ రాసి కార్పొరేట్లకు అనుకూలంగా పని గంటలలో మార్పు తీసుకురావడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్పొరేట్ శక్తుల కళ్ళల్లో ఆనందం కోసమే కార్మిక హక్కులను పణంగా పెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు పోటీ పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా కార్పొరేట్ అధిపతులు వినిపిస్తున్న అధిక పని గంటలకు, కేంద్రంలోని మోడీ తలూపుతోం దని ఎద్దేవా చేశారు. వేతనాలను పెంచి సమస్యను సరిదిద్దడానికి బదులు విరుద్ధంగా కార్మికుల చేత మరింత పని చేయించాలని కార్పొరేట్ వర్గం చాలా కాలంగా పాలకులపై ఒత్తిడి చేస్తుందని తెలిపారు. కార్మిక హక్కులను హరించే చట్ట సవరణలను, నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించు కోవాలని లేని పక్షంలో సిపిఐ, ఏఐటియుసి, ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.